# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు | జాతీయ తెలుగు దినపత్రిక

E69 NEWS



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387



PUBLISHED: TELANGANA | సంపుటి :01 | సంచిక :150 | శుక్రవారం 08 మే 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-


### జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు

# దిశా నిర్దేశం

- 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభం
- పాలనలో రిజల్ట్ ఓరియెంటేషన్‌పై సీఎం ఫోకస్
- సంపద సృష్టి లేకుండా సంక్షేమం లేదు
- అభివృద్ధి--సంక్షేమం--సంపద సృష్టి ఒకే సైకిల్
- రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల దిశగా ఏపీ అడుగులు
- గ్రీన్ ఎనర్జీ, ఏఐ, క్వాంటం రంగాల్లో ఏపీకి భారీ అవకాశాలు
- స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్‌తోనే గ్రోత్ డిసైడ్ అవుతుంది
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, మే 7:-అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు.

మిగతా 2లో ..



### తమిళనాడు సీఎంగా

# దళపతి విజయ్

## ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్!



న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న టీవీకే అధినేత విజయ్, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. లోక్‌భవన్‌లో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌తో జరిగిన భేటీ అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే, అందుకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.భేటీ సందర్భంగా గవర్నర్ కొన్ని కీలక సందేహాలను లేవనెత్తారు. మ్యాజిక్ ఫిగర్ కంటే తక్కువగా ఉన్న 113 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని గవర్నర్ ప్రశ్నించారు.

మిగతా 2లో ..

### కరీంనగర్ రాజకీయాల్లో

# 'డ్రగ్స్' మంటలు

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వర్సెస్ బండి సంజయ్.
- రణరంగంగా మారిన గంగుల క్యాంప్ ఆఫీస్!



కరీంనగర్ (తెలుగు గళం): తెలంగాణ రాజకీయాలకు గుండెకాయ వంటి కరీంనగర్ జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ సెగలు చెలరేగాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు పెను దుమారానికి దారితీశాయి. గత కొంతకాలంగా ఇరు పార్టీల మధ్య సాగుతున్న మాటల యుద్ధం, ఇప్పుడు ఏకంగా భౌతిక దాడులు మరియు పోలీసుల లాఠీఛార్జీ వరకు వెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్‌లోని మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ఆయన వ్యక్తిగత విషయాలపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. బండి సంజయ్‌కు డ్రగ్స్ అలవాటు ఉందని, ఆయన తీసుకునే పొగాకులో డ్రగ్స్ కలుపుతారని, ఆ కారణంగానే ఆయనకు బట్టతల వచ్చిందని కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు పుట్టించాయి.

మిగతా 2లో ..

### భారత జీడీపీ 6.6%కే పరిమితం




న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో అనుకున్న మేరకు వృద్ధిని సాధించలేదని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ సంస్థ అంచనా వేసింది. సంస్థ తాజా నివేదిక ప్రకారం.. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారత జీడీపీ వృద్ధి రేటు కొంత నెమ్మదించి 6.6 శాతానికి పరిమితం కానుందని పేర్కొంది.

### ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు




అమరావతి, మే 7 :బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ -- 2025 అవార్డు సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ అభినందనలు తెలిపింది. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామ స్థాయి అధికారి వరకు పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కింది.బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం మనందరి సమిష్టి కృషి. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారు...

### రష్యా అంతరిక్షంలో

# రహస్య ప్రయోగాలు?

## అమెరికా బెంబేలు!

న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): అంతరిక్షంలో రష్యా చేపట్టిన రహస్య ప్రయోగాలు ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి. గత ఏప్రిల్ 28న భూమికి సుమారు 585 కిలోమీటర్ల ఎత్తులో, రష్యాకు చెందిన కాస్మోస్ 2581, కాస్మోస్ 2583 ఉపగ్రహాలు అత్యంత సమీపానికి చేరుకుని రహస్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడైంది. ఈ రెండు ఉపగ్రహాల మధ్య దూరం కేవలం 10 అడుగులు మాత్రమే ఉండటం



ప్రపంచ అంతరిక్ష శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేసింది. సాధారణంగా అంతరిక్షంలో ఇంతటి సమీప దూరానికి ఉపగ్రహాలు వస్తే అవి ఢీకొనే ప్రమాదం ఉంటుంది, కానీ రష్యా ఉపగ్రహాలు దాదాపు సున్నా సాపేక్ష వేగంతో ఒకదానికొకటి అతి దగ్గరగా ఉండి కూడా ఢీకొట్టకుండా ఉన్నాయి. అయితే దీనిని ముందుగా ప్రమాదం అని భావించిన అంతరిక్ష పరిశోధకులు.. అనంతరం ఇదొక ప్రయోగం అని తేల్చారు.

మిగతా 2లో ..

### తృణమూల్ కాంగ్రెస్‌లో

# ఫిరాయింపులు!

న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో మరో ప్రకంపన మొదలైంది. మే 7న పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అధ్యక్షతన జరిగిన మొదటి కీలక సమావేశానికి సుమారు 10 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికల్లో టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితం కావడంతో, పార్టీ బలహీనపడిందన్న సంకేతాల మధ్య ఈ ఎమ్మెల్యేల మిస్సింగ్ ఫిరాయింపుల ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది.




### వైకాపా హయాంలో విద్యారంగంలో

# విన్నూతా మార్పులకు శ్రీకారం

- నేడు నాణ్యమైన కనీసం మధ్యాహ్నం భోజనం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం-ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు జిల్లా నెల్లూరు(తెలుగు గళం):-నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలోని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గురువారం మీడియా నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతు వైయస్సార్సీపీ పాలనలో విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టామని పేదల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతుంటే కూటమి నాయకులు కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు అని నాడు ఇంగ్లిష్ మీడియం వ్యతిరేకించిన వాళ్లంతా హైకోర్టు వ్యాఖ్యలను ఖండించగలరా? అని ప్రశ్నించారు.అదేవిధంగా ప్రణాళిక ప్రకారం వైయస్ జగన్ గారి మీద విష ప్రచారం చేశారు.

మిగతా 2లో..

# జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం

మొదటి పేజీ తరువాయి

గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులు–అధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**W-D-WC.. ఇదో సైకిల్**

“అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు... సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు**

“గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్దతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి.”అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# వైకాపా హయాంలో విద్యారంగంలో విన్నూతా మార్పులకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

అదేవిధంగా కూటమి పాలనలో పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదు. అదేవిధంగా నేడు కనీసం నాణ్యమైన మధ్యాహ్న భోజనం కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది అని తెలిపారు. అదేవిధంగా పేద పిల్లలకు చదువులు దూరం చేసే కుట్ర జరుగుతోంది.

అదేవిధంగా వైయస్ జగన్ ఐదేళ్ల కృషి వల్లే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు.

పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్నంతా మాత్రాన ఆ క్రెడిట్ కూటమి ప్రభుత్వానికి రాదు అని తెలిపారు.అదేవిధంగా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై వెనక్కి తగ్గాల్సిన పనిలేదు. అందరూ సంఘటితమై పోరాడాలి. అదేవిధంగా పీఆర్సీ, డీఏ, ఐఆర్‌లపై ప్రశ్నించకుండా జీతాలు తగ్గిస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు.

# ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు




అమరావతి, మే 7 బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ -- 2025 అవార్డు సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ అభినందనలు తెలిపింది. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామ స్థాయి అధికారి వరకు పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కింది. బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం మనందరి సమిష్టి కృషి. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారు... ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారు అనే దానికి ఈ అవార్డు ఉదాహరణ. గతంలో ఇలాంటి అవార్డులు తీసుకోవడానికి ఇష్టపడేవాడిని కాదు... కానీ ఇప్పుడు ఇలాంటి అవార్డులు మరిన్ని రావాలని కోరుకుంటున్నాను. ఎన్ని అవార్డులు వస్తే... మన రాష్ట్రానికి అంత గుర్తింపు దక్కుతుంది... మరిన్ని పెట్టుబడులు వస్తాయి. అందుకే మరిన్ని అవార్డులను మనం సాధించాలని కోరుకుంటున్నాను. ఈ అవార్డును టీమ్ ఏపీకి అంకితం చేస్తున్నాను.”అని ముఖ్యమంత్రి చెప్పారు.

# కరీంనగర్ రాజకీయాల్లో ‘డ్రగ్స్’ మంటలు

మొదటి పేజీ తరువాయి



**సవాళ్లు – ప్రతిసవాళ్లు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వస్తున్న ఆరోపణలను తిప్పికొట్టే క్రమంలో కౌశిక్ రెడ్డి ఈ తరహా విమర్శలకు దిగారు. తాము డ్రగ్స్ పరీక్షలకు సిద్ధమని, బండి సంజయ్ కూడా ధైర్యం ఉంటే పరీక్షలకు రావాలని సవాల్ విసిరారు. అంతేకాకుండా, గత ఎన్నికల్లో ఖర్చుల కోసం భార్య పుస్తెలు అమ్మానని చెప్పుకున్న సంజయ్‌కు, ఇప్పుడు వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుండి వస్తున్నాయని ఆయన నిలదీశారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.

కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగియక ముందే బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసు వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా కార్యాలయంపై దాడికి దిగారు. ఆఫీసు బయట పార్క్ చేసి ఉన్న కౌశిక్ రెడ్డి కారు అద్దాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను చెల్లాచెదురు చేస్తూ, బండి సంజయ్‌కు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

**పోలీసుల లాఠీఛార్జ్ – ఉద్రిక్తత**

రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే బీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో పలువురు బీజేపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ పట్టణంలో అదనపు పోలీస్ బలగాలను మోహరించారు. నిరంతరం నిఘా కొనసాగిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

ఈ ఘటనపై రాజకీయ స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్ మరియు హరీష్ రావు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేపై దాడి చేయడం బీజేపీ అరాచక పాలనకు పరాకాష్ట అని వారు మండిపడ్డారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే ఈ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరోవైపు, బీజేపీ నాయకులు కూడా గట్టిగానే స్పందిస్తున్నారు. కేంద్ర మంత్రి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తిపై నిరాధారమైన, నీచమైన వ్యక్తిగత విమర్శలు చేయడం కౌశిక్ రెడ్డికి తగదని వారు హితవు పలికారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి ‘డ్రగ్స్’ డ్రామాలు ఆడుతున్నారని వారు విమర్శించారు. బండి సంజయ్ వ్యక్తిత్వాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోబోమని, తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ప్రస్తుతానికి కరీంనగర్ పట్టణంలో గాలిలో ఉద్రిక్తత అలాగే కొనసాగుతోంది. గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మరిన్ని రాజకీయ యుద్ధాలకు దారితీసేలా కనిపిస్తున్నాయి. స్థానిక ప్రజలు ఈ ఘర్షణ వాతావరణం చూసి ఆందోళన చెందుతున్నారు. రాజకీయ నాయకుల మాటల తూటాలు చివరకు వీధి పోరాటాలుగా మారడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

# తమిళనాడులో ‘విజయ్’ వర్సెస్ గవర్నర్

మొదటి పేజీ తరువాయి

**రాజ్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపు**

ఈ క్రమంలో గవర్నర్ వ్యవహారశైలి ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందంటూ కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటు చేయమని పిలవకుండా గవర్నర్ కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ, చెన్నైలోని రాజ్‌భవన్ (లోక్‌భవన్) ముందు భారీ ధర్నా చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ అగౌరవపరుస్తున్నారని, బీజేపీ ఒత్తిడితోనే ఆయన ఇలా చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.మరోవైపు తమిళనాడులోని ద్రవిడ దిగ్గజాలు డీఎంకే మరియు అన్న డీఎంకే పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా తన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఏఐఏడీఎంకే (AIADMK) అధినేత ఎడప్పాడి పళనిస్వామి ‘రిసార్ట్ రాజకీయాలకు’ తెరలేపారు. టీవీకే ఆకర్షణ మంత్రానికి తమ ఎమ్మెల్యేలు చిక్కకుండా ఉండేందుకు దాదాపు 53 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఒక విలాసవంతమైన రిసార్ట్‌కు తరలించారు. ఏ క్షణమైనా ఎమ్మెల్యేలు చేజారే అవకాశం ఉండటంతో అక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

**డీఎంకే వ్యూహాత్మక మౌనం**

అధికారానికి దూరమైనప్పటికీ డీఎంకే తన పట్టు కోల్పోకుండా పావులు కదుపుతోంది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఎం.కె. స్టాలిన్, ప్రస్తుత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. టీవీకే ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆరు నెలల పాటు ఇబ్బంది పెట్టబోమని ఆయన ప్రకటిస్తున్నప్పటికీ, లోపాయికారీగా తమ మిత్రపక్షాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. డీఎంకే శ్రేణులు కూడా పుదుచ్చేరిలో తమ బలగాలను మోహరించి, టీవీకే మెజారిటీ సాధించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

విజయ్ పార్టీ టీవీకే మాత్రం ఇతర చిన్న పార్టీలైన వీసీకే (VCK), పీఎంకే (PMK)ల మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విజయ్ స్వయంగా ఫోన్ ద్వారా ఆయా పార్టీల నేతలతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ మరియు అవినీతి రహిత తమిళనాడు నినాదంతో వచ్చిన విజయ్‌కు ఇప్పుడు నైతిక బలం కంటే సంఖ్యా బలమే అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అనివార్యం కావడంతో గంట గంటకు సమీకరణలు మారిపోతున్నాయి.తమిళనాడు వ్యాప్తంగా విజయ్ అభిమానులు మరియు టీవీకే కార్యకర్తలు రాజ్‌భవన్ నిర్ణయం కోసం ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఒకవేళ గవర్నర్ విజయ్‌ను ఆహ్వానించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు టీవీకే సిద్ధమవుతోంది. తమిళనాడు వీధుల్లో ఎటు చూసినా ఈ రాజకీయ సంక్షోభంపైనే చర్చ జరుగుతోంది. విజయ్ తన రాజకీయ జీవితంలోని మొదటి మరియు అతిపెద్ద పరీక్షను ఎలా ఎదుర్కొంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రస్తుతానికి తమిళనాడు రాజకీయ కేంద్రం చెన్నై నుండి పుదుచ్చేరి రిసార్ట్‌లకు షిఫ్ట్ అయింది. ఒకవైపు గవర్నర్ సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూపులు, మరోవైపు ఎమ్మెల్యేల చేజారకుండా క్యాంపు రాజకీయాలు వెరసి తమిళనాడులో గతంలో ఎన్నడూ లేని ఉత్కంఠ కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం లోపు గవర్నర్ ఏదో ఒక స్పష్టమైన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# రష్యా అంతరిక్షంలో రహస్య ప్రయోగాలు?

## అమెరికా బెంబేలు!

మొదటి పేజీ తరువాయి



ఈ విన్యాసాల వెనుక రష్యా యొక్క అధునాతన సాంకేతిక వ్యూహాలు, అంతుచిక్కని రహస్య ప్రయోగాలు ఉన్నాయని నాసా నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా కాస్మోస్ 2583 ఉపగ్రహం అనేక సూక్ష్మ మాన్యువర్లను విజయవంతంగా నిర్వహించి, అవతలి ఉపగ్రహానికి అత్యంత చేరువగా ఉండేలా తన స్థితిని నియంత్రించుకుంది. అమెరికాకు చెందిన స్పేస్ ట్రాకింగ్ సంస్థలు మొదట దీనిని ప్రమాదం అయి ఉండవచ్చని భావించినప్పటికీ.. తర్వాత ఇది రష్యా ఉద్దేశపూర్వకంగా నిర్వహించిన ప్రయోగం అని గుర్తించాయి. రష్యాకు గతంలో కూడా ఇలాంటి ‘ప్రాక్సిమిటీ ఆపరేషన్స్’ నిర్వహించిన చరిత్ర ఉంది. ఈ రహస్య పరీక్షల ఉద్దేశ్యంపై అంతర్జాతీయ రక్షణ నిపుణుల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది.

రష్యా ఈ ప్రయోగాల ద్వారా ఇన్–ఆర్బిట్ ఇన్‌స్పెక్షన్, డాకింగ్, రెండెజ్వస్ సామర్థ్యాలను పరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకా ప్రమాదకరమైన కోణంలో ఆలోచిస్తే, శత్రు దేశాల ఉపగ్రహాలను పట్టుకోవడం లేదా వాటిని నిర్వీర్యం చేసే యాంటీ–సాటిలైట్ సాంకేతికతను రష్యా బలోపేతం చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా, చైనా వంటి దేశాలకు పోటీగా అంతరిక్షంలో రష్యా తన పట్టును నిరూపించుకోవడానికి ప్రయోగాలు ముమ్మరం చేస్తునట్టు తెలుస్తోంది.

# భారత జీడీపీ 6.6% కే పరిమితం

మొదటి పేజీ తరువాయి


గతంలో ఈ వృద్ధి 7.1 శాతంగా ఉంటుందని అంచనా వేసినప్పటికీ, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఈ అంచనాలను సవరించడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో మాత్రం వృద్ధి రేటు 7.6 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అయితే ఈ అంచనాల తగ్గింపుకు ప్రధానంగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కారణమని ఎస్అండ్‌పీ విశ్లేషించింది. దెబ్బ తీయనున్న పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు

పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల వల్ల గ్లోబల్ సప్లై చైన్ దెబ్బతినడం, క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం వల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉందని అంచనా వేస్తోంది. అలాగ దిగుమతుల భారం పెరిగి కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడటం వంటి అంశాలు వృద్ధిని మందగించేలా చేస్తున్నాయి. భారత్ నిర్దేశించుకున్న ‘వికసిత్ భారత్ - 2047’ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏటా స్థిరంగా 8 శాతం కంటే ఎక్కువ వృద్ధి సాధించాలని ‘ఇండియా ఫార్వర్డ్’ పేరుతో విడుదల చేసిన ఈ జాయింట్ రిపోర్ట్ స్పష్టం చేసింది. ఇందుకోసం ఎనర్జీ సెక్యూరిటీ, ఫుడ్ సెక్యూరిటీ, ఎనర్జీ స్టోరేజ్ పాలసీ వంటి రంగాల్లో తక్షణ సంస్కరణలు అవసరమని సూచించింది.

భారీగా పెరగనున్న ద్రవ్యోల్బణం

అయితే మూడీస్ మాత్రం ఈ ఒడిదుడుకులు తాత్కాలికమేనని భారత్ వద్ద ఉన్న భారీ విదేశీ మారక నిల్వల సహాయంతో వీటన్నిటిని తేలిగ్గానే ఎదుర్కోగలుగుతుందని అంచనా వేసింది. మరోవైపు మిడిల్ ఈస్ట్ దేశాల ఉద్రిక్తతల వల్ల భారత జీడీపీ 6.3% కే పరిమితం కావొచ్చని ఏడీబీ అంచనా వేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం గణనీయంగా 2.4 శాతం మేర పెరిగి 6.9 శాతానికి చేరుకోవచ్చని పేర్కొంది.

# దూసుకొస్తున్న ద్రోణి.. తెలంగాణకు భారీ వర్ష సూచన!




న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): ఎండలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. కర్ణాటక నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా ఒక ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో రానున్న 3 రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా తెలంగాణలోని జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, కోస్తా తీర ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవవచ్చని వాతావరణ కేంద్రం పేర్కొంది. అదేవిధంగా రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రైతులు తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# తృణమూల్ కాంగ్రెస్ లో ఫిరాయింపులు!



న్యూస్ డెస్క్, 07 మే (తెలుగు గళం): పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో మరో ప్రకంపన మొదలైంది. మే 7న పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అధ్యక్షతన జరిగిన మొదటి కీలక సమావేశానికి సుమారు 10 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఎన్నికల్లో టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితం కావడంతో, పార్టీ బలహీనపడిందన్న సంకేతాల మధ్య ఈ ఎమ్మెల్యేల మిస్సింగ్ ఫిరాయింపుల ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ముఖ్యంగా బీజేపీ భారీ విజయం సాధించిన నేపథ్యంలో, అసంతృప్త ఎమ్మెల్యేలు పార్టీ మారుతారనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే, ఈ ప్రచారాన్ని టీఎంసీ అధిష్ఠానం తీవ్రంగా ఖండించింది. గైర్హాజరైన ఎమ్మెల్యేలందరూ ముందస్తు అనుమతి తీసుకున్నారని వివరణ ఇచ్చింది. ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల తదనంతర హింస చోటుచేసుకోవడంతో, ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే కొంతమంది నేతలు సమావేశానికి రాలేకపోయారని పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. కేవలం 70 మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరైనప్పటికీ, పార్టీ ఐక్యంగానే ఉందని మమతా బెనర్జీ కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేశారు.

# కాలుష్యరహిత సోలార్ ఉత్పత్తితో రైతులకు ఆదాయం

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో డిఈ బి.సారయ్య



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే07**

స్టేషన్ ఘనపూర్ గురువారం మునిసిపల్ పట్టణ కేంద్రంలోని రైతువేదికలో సమీకృత ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్న ఎన్పిడిసీఎల్ ఘనపూర్ డిఈ బి.సారయ్య కాలుష్య రహిత సోలార్ ఉత్పత్తి ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గృహజ్యోతి పథకంతో విద్యుత్ శాఖ ఎన్పిడిసీఎల్ కంపెనీ పరిధిలో 26లక్షల మంది లబ్ధిదారులకు సంవత్సరానికి ఒక కోటి 53లక్షల వరకు పేద,మధ్యతరగతి కుటుంబాలకు సబ్సిడీ అందుతుందని చెప్పారు,రైతులకు 24గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరాతోపాటు ప్రభుత్వ విద్యా సౌంస్థలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత సరఫరా అందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం కుసుమ్ కాంపొనెంట్ పథకం ద్వారా మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమంలో నిర్దేశించబడిన గ్రామాలలోని ప్రతీ వ్యవసాయ పంపుసెట్టుకు 7.5 కిలో వాట్ల సామర్థ్యంతో కూడిన సౌర విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నారని ఇందులో రైతులకు సరిపడా సరఫరాను వాడుకొని మిగిలిన సరఫరా గ్రిడ్ కు అమ్ముకొని ఆదాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా ప్రభుత్వం ఒక కిలోవాడ్ ప్లాంటుకు ముప్పై వేల రూపాయల సబ్సిడీ అందిస్తుందన్నారు, అందుకు బ్యాంక్ అకౌంట్ ఉంటే సరిపోతుందని చెప్పారు, అనంతరం విద్యుత్ భద్రతా నియమాలపై వక్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో పాటు,ఏడిఈ పి.రణధీర్ రెడ్డి, ఏఈ శివ కుమార్ సిబ్బంది రామాచారి, యాదగిరి, పెద్దిరెడ్డి, కాలురామ్, శ్రీధర్, లక్పతి, సురేందర్ రెడ్డి, నాగరాజు, కుంభం రాము, సురేందర్, వెంకటేష్, అశోక్ మరియు రైతులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత



**తెలుగు గళం న్యూస్ వరంగల్/రాయపర్తి మే07**

రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచనల మేరకు బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సహాయం అందించారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల యాకయ్య కుమార్ తల్లి నిమ్మల లింగమ్మ ఇటీవల మృతిచెందడంతో గురువారం ఫౌండేషన్ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను సహాయంగా అందజేశారు. పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సూచనలతో ఈ సహాయ కార్యక్రమంలో మండల నాయకులు లేతాకుల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ కర్ర సరితా రవీందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు దేశబోయిన ఉపేందర్, గజవెల్లి అనంత ప్రసాద్, పుల్ల ఎల్లగౌడ్, సోమన్న, నేరెళ్ల రాములు, కర్ర ప్రవీణ్ రెడ్డి, దేవేందర్, సురేష్, కలరావు, జనార్దన్, యుగేందర్, రాజు, వరుణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిడబ్ల్యుజేఎఫ్ పై తప్పుడు ప్రచారం మానుకోవాలి- మామిడి సోమయ్య హెచ్చరిక

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, మే 7**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు. సంఘం నుంచి తొలగించబడిన బసవపున్నయ్య, పిల్లి రాంచందర్‌లు తమపై మరియు సంఘంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సంఘ వ్యవస్థాపకులను బహిష్కరించామంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు. కేసు న్యాయస్థానంలో ఉండగానే పరువు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం దురుద్దేశపూరిత చర్య అని విమర్శించారు. ఇకపై “బహిష్కరణ” వంటి పదాలు ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మామిడి సోమయ్య 1988 నుంచి వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేసి, జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం 3000 మందికి పైగా సభ్యులు ఉన్న టిడబ్ల్యుజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఒక దినపత్రిక, మాసపత్రిక ఎడిటర్‌గా, కేబుల్ న్యూస్ చానల్ సీఈఓగా, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. బసవపున్నయ్యపై కూడా తీవ్ర విమర్శలు చేస్తూ, ఆయన జర్నలిస్టుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని ప్రశ్నించడం తప్పా అని ప్రశ్నించారు. టిడబ్ల్యుజేఎఫ్ స్థాపనలో బసవపున్నయ్య పాత్ర లేదని, సంఘాన్ని తాము స్వయంగా 2010లో రిజిస్టర్ చేసుకున్నామని స్పష్టం చేశారు. తమపై సోషల్ మీడియాలో అవాకులు చవాకులు పేలుస్తూ తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ ప్రకటనపై మామిడి సోమయ్యతో పాటు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, ఆర్. వెంకటేశ్వర్లు, కుడితాడు బాపురావు, తన్నీరు శ్రీనివాస్ తదితరులు సంతకాలు చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

## బాధిత కుటుంబాలకు అండగా సర్పంచ్ కనుకయ్య యాదవ్



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 7**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం జమాల్‌పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ గ్రామంలో ఇద్దరు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. గోదారి వీరన్న కూతురు మానస,లాదెల్ల హేమంత్ భార్య సౌజన్యలకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.60 వేల చొప్పున మొత్తం రూ.1.20 లక్షల చెక్కులను సర్పంచ్ పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న బాధితులు మాట్లాడుతూ...

“ప్రభుత్వం ద్వారా ఆసుపత్రి ఖర్చులకు రూ.1.20 లక్షల చెక్కులు అందించిన ఎమ్మెల్యే నాగరాజుకు చెక్కులు రావడానికి కృషి చేసిన సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ గారికి,ప్రభుత్వానికి ఋణపడి ఉంటాం”అని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 200 యూనిట్ల ఉచిత కరెంటు

## లక్షల ఇళ్లకు జీరో బిల్లు భరోసా- ఏడీఈ తిరుపతి



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 7**

వరంగల్ జిల్లా:పర్వతగిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా లక్షలాది కుటుంబాలు ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందుతున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏడీఈ వాంకుడోత్ తిరుపతి అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు కలిగిన అర్హులైన గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఈ పథకం ప్రజలకు భారీ ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. మండల రైతాంగానికి 24 గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా కొనసాగుతోందని, మండలంలోని అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు నిరంతర విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. రైతులు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్‌ను డిస్కంల ద్వారా టి జి ఈ ఆర్ సి నిర్ణయించిన స్థిర ధరకు 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తారని చెప్పారు. వ్యక్తిగత రైతులు, రైతు సమూహాలు, సహకార సంఘాలు,పంచాయతీలు, ఈ ఎఫ్ ఓ లు,స్వయం సహాయక సంఘాలు,గ్రామ సంఘాలు ఈ పథకానికి అర్హులని వెల్లడించారు.

“వ్యవసాయాన్ని సోలార్‌తో జోడించి రైతుకు స్థిరమైన ఆదాయం – దేశానికి స్వచ్ఛ ఇంధనం అందిద్దాం” అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఏడీఈ తిరుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచ్‌లు, విద్యుత్ శాఖ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి పోరాటస్ఫూర్తితో మోడీ విధానాలపై తిరుగుబాటు చేద్దాం

## కాకినాడలో అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ప్రజా సంఘాలు నివాళులు



**కాకినాడ (తెలుగు గళం) మే 7 :** మన్యం విప్లవ వీరుడు స్వాతంత్ర సమరయోధుడు గిరిజనుల ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి సందర్భంగా ఆయన ఇచ్చిన పోరాట స్ఫూర్తితో కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం సిపిఐ ఏఐటీయూసీ ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణారావుపేట అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ ఆనాడు బ్రిటిష్ పాలకులకు నేడు బీజేపీ పాలకుల విధానాలకు ఏమాత్రం తేడా లేదని ఆయన అన్నారు ఆనాడు బ్రిటిష్ వారు ప్రజలపై అనేక పన్నులు వేసి ప్రజలపై భారాలు మోపారని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలపై వివిధ పన్నుల రూపంలో పెద్ద ఎత్తున వసూలు చేసి ప్రజలపై భారాలను మోపుతున్నారని ఆయన అన్నారు. బ్రిటిష్ కాలంలోనే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను చట్టాలను నేడు నల్లపాలకులు వాటిని రద్దుచేసి కార్మికులను బానిసలుగా తీర్చి దిద్దుతున్నారని మధు అన్నారు. ఆనాడు బ్రిటిష్ వారు గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహజ వనరులను లూటీ చేశారని నేడు బిజెపి ప్రభుత్వం గ్రావెల్ గ్రానైట్ తదితర ఖనిజాలను అక్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్వాతంత్రం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు కలలు నెరవేరలేదని నేడు మరో స్వాతంత్రం పోరాటం చేయవలసిన అవసరం ఆసన్నమైందని మధు పిలుపునిచ్చారు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా కేంద్ర రాష్ట్ర విధానాలపై పోరాటాలను ఎక్కి పెట్టాలని పిలుపునిచ్చారు.

# గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు ప్రారంభం

## డి.ఎస్. వెంకన్న ప్రకటన




**తెలుగు గళం న్యూస్ వరంగల్/మే7 వరంగల్ జిల్లా:**

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో వరంగల్, కరీంనగర్, జనగామ జిల్లాల్లోని జూనియర్ కళాశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ.బై పి సి గ్రూపులలో ప్రవేశాలకు నేరుగా అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డి.ఎస్. వెంకన్న తెలిపారు.

కౌన్సెలింగ్ తేదీ & వేదిక: తేదీ: 16-05-2026, ఉదయం 10:00 గంటలకు

వేదిక: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, యాకుబ్‌పుర, వరంగల్.

ప్రవేశం కల్పించే కళాశాలలు:

గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలు:

1. దేవన్నపేట, హనుమకొండ జిల్లా
2. గూడూరు, పాలకుర్తి, జనగామ జిల్లా
3. పర్వతగిరి, వరంగల్ జిల్లా
4. మూడుచెక్కలపల్లి, నర్సంపేట, వరంగల్ జిల్లా

గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల:

1. నర్సంపేట, వరంగల్ జిల్లా

అర్హత: గిరిజన మరియు గిరిజనేతర విద్యార్థినీ, విద్యార్థులు అర్హులు.

తీసుకురావాల్సిన పత్రాలు:

టీసీ, మెమో, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆదాయ మరియు కుల ధృవీకరణ పత్రంతో పాటు 2 జతల జిరాక్స్ ప్రతులు తప్పనిసరిగా తీసుకురావాలి. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత తేదీ, సమయానికి హాజరు కావాలని ఆర్సీఓ డి.ఎస్. వెంకన్న ఒక ప్రకటనలో కోరారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన

# రైతన్నలను ఆదుకోవాలి



- పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి.
- రైతులను నిర్లక్ష్యం చేస్తే తగినమూల్యంచెల్లించుకోక తప్పదు
- బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

తెలుగు గళం న్యూస్ ,పర్వతగిరి, మే 7 :

పర్వతగిరి మండల కేంద్రంలో గురువారం ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి రైతులు పండించిన పంటలను ప్రభుత్వం సకాలంలో ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతన్నలకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతమని, రైతు రాజ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో దారుణంగా గాలులు వీస్తూ భారీ వర్షాలు పడి కళ్ళాలలోనే వడ్లు మొక్కజొన్న చేతికి అందిన పంటలు తడిసి ముద్దవ్వడం, కొన్ని ప్రాంతాల్లో కొట్టుకపోవడంతో రైతులకు కన్నీళ్లే మిగిలాయన్నారు. అనేక గ్రామాలలో ఐకెపి సెంటర్లలో ధాన్యం రాశులపై టార్పాలిన్ కప్పిన క్రింది నుండి వర్షపు నీరు చేరి ధాన్యమంత తడిస్తే రైతులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారన్నారు. సొంత పెట్టుబడి లేని రైతులు ఎన్నో ఇబ్బందులు పడి అప్పులు చేసి ఎన్నో ఆశలతో పంటలు పండిస్తే ప్రభుత్వ సకాలంలో కొనకపోవడం, అకాల వర్షాలు రావడం తో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ధన్య రాశుల వద్ద రాత్రింబగళ్ళు ఉంటున్న కొందరు రైతులు మనస్థాపానికి గురై, మరికొందరు ప్రమాదాలకు గురై కల్లాల వద్దనే ప్రాణాలు కోల్పోతుంటే వారి కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారన్నారు. మరణించిన కుటుంబాల వారికి రూ.25 లక్షలు ఎక్స్ గ్రేసియో చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వర్షాలకు తడవకుండా ప్రతి గ్రామంలో పక్కాగా కల్లాల షెడ్లు నిర్మించాలని, రైతు సమస్యలను యుద్ధ ప్రాతిపదికగా పరిష్కరించ కుంటే రైతాంగ ఆగ్రహానికి గురికావలసి వస్తుందని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## శాంతియుత దీక్ష శివునికి ప్రత్యేక ప్రార్ధనలు ఆలయ శుద్ధి కార్యక్రమం

తెలుగు గళం న్యూస్ నర్సంపేట /అశోక్ నగర్ మే 7



ఖానాపూర్ మండలం అశోక్ నగర్‌లోని మట్టి కోటలో 700 ఏళ్ల చరిత్ర కలిగిన, కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలో నిర్మితమైన పురాతన శివాలయం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ఇటీవల తొలగించడం హిందూ సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది. మన పూర్వీకులు భక్తిశ్రద్ధలతో నిర్మించిన ఆలయం, మన సంస్కృతికి, చరిత్రకు ప్రతీక. అభివృద్ధిని మేము వ్యతిరేకించడం లేదు. కానీ మన వారసత్వ సంపదను, దేవాలయాలను కాపాడుకుంటూ అభివృద్ధి జరగాలి. ఆలయానికి చెందిన 14 ఎకరాల భూమిని పరిరక్షించి, కూల్చిన చోటే శివాలయాన్ని పునర్నిర్మించాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మరో ప్రభుత్వ స్థలానికి మార్చాలని మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ నేపథ్యంలో, ఆలయ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, పురావస్తు మరియు దేవాదాయ శాఖలు స్పందించాలని కోరుతూ బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ధర్మాగ్రహ దీక్ష కు పిలుపునిచ్చారు. ఇది మన ధర్మాన్ని, మన చరిత్రను, మన భవిష్యత్ తరాల కోసం మన సంస్కృతిని కాపాడుకునే పోరాటం. కావున నర్సంపేట నియోజకవర్గంలోని పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, హిందూ సంఘాల నాయకులు, భక్తులు అందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ ధర్మాగ్రహ దీక్ష లో పాల్గొని సంఘీభావం తెలపాలని డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కోరుతున్నారు, మనం మౌనంగా ఉంటే మన చరిత్రే కనుమరుగవుతుంది. మన ఆలయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత. రండి, చేయి చేయి కలుపుదాం.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిరోదిద్దాం

# ప్రజా ఆరోగ్యాన్ని రక్షిద్దాం



తెలుగు గళం న్యూస్ నర్సంపేట మే 7

నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయం నందు ఎ.స్.ర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్ వాడకం నిషేధం పై ఫంక్షన్ హాల్స్ మరియు హోటల్స్ టిఫిన్ సెంటర్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు గ్లాసులు స్పూన్లు ప్లేట్లు స్ట్రాలు, మరియు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగులను హోటళ్లలో వాడకూడదని అన్నారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల ఏళ్లు పడుతుందని,ఇది భూగర్భ జలాలను కలుషితం చేయడమే కాకుండా మనం ఆహారంతో కూడిన ప్లాస్టిక్ కవర్లను బయటపడేయడం ద్వారా పశువులు ఆహారంతో పాటు ప్లాస్టిక్ కవర్లను కూడా తినడం ద్వారా వాటి ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతోందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులలో వేడి ఆహారాన్ని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది అన్నారు. కావున ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని ప్లాస్టిక్‌ను నిషేధించి,మన ఆరోగ్యాన్ని మరియు ప్రకృతిని రక్షించుకుందాం అన్నారు. 15 రోజుల్లోగా హోటల్స్ టిఫిన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలని యజమానులను కోరారు లేనియెడల నిషేధిత ప్లాస్టిక్ వాడితే జరిమానాలు విధిస్తామని అన్నారు. ఫంక్షన్ హాల్స్ నందు భోజన సమయంలో పేపర్ ప్లేట్స్ బదులుగా తాటి అరటి ఆకు ప్లేట్లను వినియోగించే విధంగా యజమానులు శుభకార్యాలు చేసుకునే వారికి అవగాహన కల్పించాలని కోరారు ఆరోగ్యవంతమైన సమాజం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధిద్దాం అని పిలుపునిచ్చారు.

మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ మాట్లాడుతూ

ప్లాస్టిక్ కవర్లలో వేడివేడి ఆహారాన్ని తిని,అనారోగ్య భారిన పడవద్దని అన్నారు. ప్లాస్టిక్ కవర్స్ బదులుగా ప్రత్యన్మయ ఏర్పాట్లు చేయడం జరిగిందినీ హోటల్స్ మరియు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులు ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే బయో కవర్లు ఉపయోగించాలని కోరారు. ఇలాంటి సమాజానికి ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎ.స్.ర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఎర్రబోయిన రాజశేఖర్ గారిని మున్సిపల్ చైర్ పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ,కౌన్సిలర్ పొన్నాల మనిషా ప్రకాష్,ఫంక్షన్ హాల్,హోటల్స్,టిఫిన్ ఁ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమానులు,ప్లాస్టిక్ షాప్ యజమానులు తదితరులు పాల్గొన్నారు

## ఒంటిమామిడిపల్లిలో బీరన్న కళ్యాణోత్సవం ముగింపు

### మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ప్రత్యేక పూజలు



తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే7

హన్మకొండ జిల్లా:అయినవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామంలో గత వారం రోజులుగా వైభవంగా జరుగుతున్న బీరన్న కామరాతి కళ్యాణోత్సవం'పెద్ద పండుగ'ఘనంగా ముగిసింది.చివరి రోజు సందర్భంగా వర్ధన్నపేట కాంస్టెన్సీ మాజీ ఎమ్మెల్యే శ్రీ కొండేటి శ్రీధర్ గ్రామానికి విచ్చేసి బీరన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కురుమ పెద్దలను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం అయినవోలు మండల బీజేపీ ఉపాధ్యక్షులు శ్రీ నరిగె రాజేష్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ ని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడెపు భాస్కర్, బొల్లెపల్లి మహేశ్వర్ గౌడ్, ఆడెపు విక్రమ్,రమేష్,నాగరాజు,మిగతా కురుమ పెద్దలు,బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వారం రోజుల పాటు జరిగిన బీరన్న కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## మే 10న బీజేపీ

# భారీ బహిరంగ సభ ఏర్పాటు

తెలుగు గళం న్యూస్ నర్సంపేట మే 7



నర్సంపేట బీజేపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఈరోజు పత్రిక సమావేశం ఏర్పాటు చేయడమైనది ఈ సమావేశంలో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10,న పర్యటించనున్నారని, ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం 3:00 గంటలకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు, దక్షిణాది రాష్ట్రాలకు వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ సభ. పార్లమెంట్‌లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడితే ఆ బిల్లుకు వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణలో 6 గ్యారెంటీల పేరుతో మోసం చేసి, రైతులను, మహిళలను, నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై జనంలో ఆగ్రహం పెల్లుబుకుతోంది.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని, బీజేపీ బలమైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతోందని చాటిచెప్పేందుకే ఈ సభ. ప్రధాని మోదీ తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ నాయకులు పాల్గొంటారని కాబట్టి నర్సంపేట నియోజకవర్గం నుండి మహిళలు, యువత, రైతులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరూ మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌కు భారీగా తరలివచ్చి ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు



ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డేపల్లి నరసింహ రాములు గారు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ గారు, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు పార్లమెంటు కో కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి నియోజకవర్గం బిజెపి నాయకులు జూలూరి మనీష్ గౌడ్ వనపర్తి మల్లయ్య కోమల్ రెడ్డి పాలడుగుల జీవన్ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, నల్లబెల్లి మండల అధ్యక్షులు తడక వినయ్ గారు, నర్సంపేట రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ దుగ్గొండి మండల అధ్యక్షులు నేదురు రాజేందర్ ఖానాపూర్ మండల అధ్యక్షులు రాదారపు అశోక్ చెన్నారావుపేట మండలం అధ్యక్షులు శేఖర్ జిల్లా కౌన్సిల్ సభ్యులు దుంక దువ్వ రంజిత్ మాజీ ఎం.పి.టి.సి భాషా బోయిన రాజు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్ గౌడ్ మహిళా నాయకురాలు వసంతకుమారి వివిధ మండలాల ప్రధాన కార్యదర్శిలు ఉపాధ్యక్షులు, యువ మోర్చా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కాజీపేటలో నూతన "హోటల్ అమాన్స్" ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే07



కాజీపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన "హోటల్ అమాన్స్" వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య, నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ఏర్పాటవడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ హోటల్ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు, హోటల్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



# గోపనపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### రైతులకు యూరియా వినియోగం తగ్గింపు, నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించిన అధికారులు

### వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డి.వీరన్న

తెలుగు గళం పర్వతగిరి మే7



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో గోపనపల్లిలో రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం రైతులను గ్రామంలో ఒకే వేదికలో అందరిని సమీకరించి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. డి. వీరన్న, శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ రైతులకు యూరియా వినియోగం తగ్గింపు, నేల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. అవసరం మేరకుమాత్రమేరసాయనాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరాన్ని వివరించారు.

అలాగే పంటల మార్పిడి విధానం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి ఆదా పద్ధతుల గురించి రైతులకు సవివరంగా తెలియజేశారు. మార్కెట్‌కు అనుగుణంగా పంటల రకాల ఎంపిక చేసి అధిక ఆదాయం పొందే విధానాలపై సూచనలు ఇచ్చారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు ఆలోచించాలి అని, అలాగే చీడపీడలను సమగ్ర పద్ధతులద్వారానివారించాల్సిన అవసరాన్ని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు జి . పూజ,ఎన్. ఇందు,వ్యవసాయ విస్తరణ అధికారి బి. కార్తీక్, పంచాయతీ సెక్రటరీ ఎండీ. పాషా మరియు రైతులు పెద్ద పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# వంశపారంపర్య క్యాన్సర్లలకు సోమాజిగూడ యశోద హాస్పిటల్ హైదరాబాద్‌లో టార్గెటెడ్ థెరపీ , ఇమ్యునోథెరపీ వంటి చికిత్స అందుబాటులో ఉన్నాయి

### ఆంకాలజిస్ట్ మరియు హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ హరీష్ కంచర్ల

తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / మే 08, ఖమ్మం జిల్లా : ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమాజిగూడ యశోద హాస్పిటల్స్లో కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ మరియు హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ హరీష్ కంచర్ల మాట్లాడుతూ "ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల తీరులో మనం ఒక గణనీయమైన మార్పును చూస్తున్నాము . పొగత్రాగనివారు మరియు యువకులు అధిక సంఖ్యలో ఈ వ్యాధి బారిన పడుతున్నారు . జన్యుపరమైన కారకాలు , ముఖ్యంగా వంశపారంపర్య క్యాన్సర్లలో కీలక పాత్ర పోషిస్తాయి . ఎన్.జి.ఎస్

మరియు పీసీర్ వంటి అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులు , అలాగే టార్గెటెడ్ థెరపీ మరియు ఇమ్యునోథెరపీ వంటి చికిత్సల రాకతో మనం ఇప్పుడు మరింత వ్యక్తిగతీకరించిన మరియు ప్రభావవంతమైన చికిత్సా విధానాలను అందించగలుగుతున్నాము . ముఖ్యంగా సాధారణ రక్త పరీక్షల ద్వారా ముందస్తుగా స్క్రీనింగ్ చేయడం వల్ల , లక్షణాలు కనిపించక ముందే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను గుర్తించవచ్చు . తద్వారా చికిత్స ఫలితాలు గణనీయంగా మెరుగుపడతాయి." అని అన్నారు . అధునాతన ఊపిరితిత్తుల క్యాన్సర్కు చికిత్సా విధానాలు సాంప్రదాయ కీమోథెరపీని దాటి అభివృద్ధి చెందాయి . నేడు టార్గెటెడ్ థెరపీ మరియు ఇమ్యునోథెరపీ అనేవి మనుగడ రేట్లను మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడం ద్వారా రోగులకు కొత్త ఆశను అందిస్తున్నాయి . టార్గెటెడ్ థెరపీ నిర్దిష్ట జన్యు ఉత్పరివర్తనాలపై దృష్టి సారిస్తుంది . అయితే ఇమ్యునోథెరపీ క్యాన్సర్ కణాలతో మరింత సమర్థవంతంగా పోరాడటానికి శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది . ఒకప్పుడు సాంప్రదాయ చికిత్సా పద్ధతులు పరిమితంగా ఉన్న అధునాతన దశలలో ఈ చికిత్సలు ప్రత్యేకంగా మన సోమాజిగూడ యశోద హాస్పిటల్ హైదరాబాద్ లో అందుబాటులో ఉన్నాయి అని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు , నాగార్జున , బాల కృష్ణ పాల్గొన్నారు .



# చేనేత వస్త్రాలను ప్రోత్సహించిన

## వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

**నేతన్నల శ్రమకు ప్రోత్సాహంగా స్వయంగా పలు చేనేత చీరలను కొనుగోలు చేసిన ఎంపీ**

**చేనేత మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక**


**నేతన్నల శ్రమను ప్రతి ఒక్కరూ గౌరవించాలి**

**చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**



తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే07

సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం--వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య, అక్కడ ప్రదర్శనలో ఉంచిన చేనేత చీరలు, వస్త్రాల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు నేతన్నల శ్రమకు ప్రోత్సాహంగా స్వయంగా పలు చేనేత చీరలను కొనుగోలు చేసి చేనేత రంగానికి తన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... చేనేత మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. నేతన్నలు ఎంతో కష్టపడి నేసే ప్రతి వస్త్రంలో వారి కళాత్మకత, శ్రమ ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. స్థానికంగా తయారయ్యే చేనేత ఉత్పత్తులకు ఆదరణ పెరిగితే నేతన్నల కుటుంబాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని తెలిపారు.



# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు-ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత

### వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



తెలుగు గళం న్యూస్ వరంగల్ మే07

వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ జంక్షన్‌లో గురువారం రోజు ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు బృందాలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత మాట్లాడుతూ యువతతో పాటు అన్ని వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలతో చెలగాటమాడినట్లేనని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాద రహిత నగరమే లక్ష్యంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు ఇకముందు కూడా నిరంతరం కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

# చురుకుగా సాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులు...



చోడవరం :మే 07, చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి. హెచ్. సి) అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. సు మారు రూ. 5 కోట్లు ప్రభుత్వ నిధుల తో 50 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేస్తున్న విషయం విదితమే. ఆసుపత్రి అభివృద్ధి కమిటి చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, కమిటి నెంబర్ పప్పు శ్రీను లు గురువారం ఆసుపత్రి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించవలసిందిగా కాంట్రాక్టర్కు సూచించారు. మీడియాతో వారు మాట్లాడుతూ రాజకీయలకు అతీతంగా చుట్టుపక్కల సుమారు 100 పైగా గ్రామాల నుండి ప్రమాద సమయాల్లోను, నిత్యం వచ్చే రోగుల సౌకర్యార్థం స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు కృషితో చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తున్న విషయాలను వారు తెలియజేశారు.

# మధురవాడలో సీపీఐ ఆధ్వర్యంలో సీతారామరాజు 102వర్ధంతి




విశాఖపట్నం, మే 7(తెలుగు గళం): గిరిజనుల్ని చైతన్యవంతం చేసి, బ్రిటిష్ పాలకుల్ని ఎదిరించి సాయుధ పోరాటం నడిపిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుదు మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. అల్లూరి 102వ వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి మధురవాడ గణేష్ నగర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పైడిరాజు మాట్లాడుతూ విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంకిలోని తన అమ్మమ్మ ఇంట జూలై 4, 1897న అల్లూరి జన్మించారని, మే 7, 1924 మే 7న ఉమ్మడి విశాఖ జిల్లా కొయ్యూరు మండలం మంపలో బ్రిటిష్ వాళ్లు ఆయన్ను కాల్చి చంపారని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తిగా అల్లూరి జరిపిన సాయుధ పోరాటం ఆ ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని, సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, అమాయక గిరిజనుల్ని బ్రిటిష్ వారు పెడుతున్న చిత్రహింసలు చూసి, గ్రామస్తులతో మమేకమై గిరిజన సంప్రదాయ విల్లంబులతోనే రెండేళ్ల పాటు బ్రిటిష్ వాళ్లను అల్లూరి గడగడ లాడించి ప్రాణాలర్పించిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో బి.కేశవయ్య, పీవీ అప్పారావు, బెల్లాపు పాపారావు, సతీష్, అల్లు శంకరరావు, అప్పలరాజు, మహేష్, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవం

కడపజిల్లా జమ్మలమడుగులో శ్రీ నారాపుర వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా...గురువారం రథోత్సవం వైభవంగా సాగింది. ఈ రథోత్సవ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరై రథం లాగేందుకు పోటీపడ్డారు.

జమ్మలమడుగులో నారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 30వ తేదిన ప్రారంభమై ఈనెల మే 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగానే రథోత్సవం సందర్భంగా ఈ రోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు దేవదేవుడైన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీనులైన రథం లాగే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, కడపజిల్లా టిడిపి అధ్యక్షులు భూపేష్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం నారాపుర ఆలయం మీదుగా అశేష జన భక్తి సమూహంతో జమ్మలమడుగు పట్టణంలోని పురవీధులలోతేరురోడ్డు,తాడిపత్రి రోడ్డు,పెద్దపసుపులమోటు, సంజామలమోటు,పాత బస్టాండ్ మీదుగా ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు రథయాత్ర సాగింది. మెయిన్ బజారు మీదుగా నారాపుర ఆలయం ఆవరణానికి రథం చేరుకుంటుందని టిటిడి అధికారులుతెలిపారు. పట్టణంలోని పలువురు భక్తులకు చల్లని పానియాలు,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు..

# రైతన్నే దేశానికి అన్నం పెట్టే గొప్ప వ్యక్తి

- రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం
- రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది
- రైతు రుణమాఫీ చేయని వారు విమర్శలు చేయడం సిగ్గుచేటు
- రైతు సంక్షేమంపై ప్రతిపక్షాల విమర్శలు ప్రజలు నమ్మరు..
- సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నారు
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాకు హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య







తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే07

హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం-- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు.అంతకుముందు హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సాంకేతిక స్టాళ్లను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు, పథకాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ...రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చి భూమిలో విత్తనాలు నాటి, వాటిని పంటలుగా మార్చి దేశానికి అన్నం పెడుతున్న గొప్ప వ్యక్తి రైతన్న అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. రైతు కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.రైతుల




సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చిందన్నారు.రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఇందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు.వ్యవసాయ పనిముట్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తూ రైతుల భారం తగ్గిస్తున్నామని తెలిపారు.మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర స్థాయి రైతు ప్రణాళికలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగుకు బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు.రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఇలాంటి మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించి రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు నిజం తెలుసుకోవాలని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను పదేపదే కలిసి ప్రత్యేక నిధులు తీసుకువస్తూ తెలంగాణకు మేలు చేస్తున్నారని పేర్కొన్నారు.నిలిచిపోయిన స్టార్టప్ సెంటర్లకు పునర్జీవం పోసి, కేంద్రం నుంచి వేల కోట్ల నిధులు వచ్చేలా కృషి చేస్తున్నారని తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని, దీని ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇప్పుడు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ప్రతిపక్షాలపై ఎంపీ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ లో చేరిన పలువురు యువ నాయకులు



తెలుగు గళం,హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వం మరియు ఆత్మగౌరవ పరిరక్షణే ధ్యేయంగా కల్వకుంట్ల కవిత సమక్షంలో పలువురు కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేన కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై అలుపెరగని పోరాటం చేస్తూ ప్రజల గొంతుకగా నిలిచిన కవిత నాయకత్వంలో పనిచేయడం తమకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కండువా కేవలం ఒక వస్త్రం కాదని, తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేసే ఒక గొప్ప బాధ్యత అని వారు పేర్కొన్నారు. సామాన్య కార్యకర్తలను సైతం ఆదరించే మట్టి వాసన తెలిసిన నాయకురాలు కవిత అని, ఆమె అడుగుజాడల్లో నడుస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మళ్లీ సమరశంఖం పూరిస్తామని స్పష్టం చేశారు. కవిత నాయకత్వం తమకు కొండంత అండని, పార్టీ బలోపేతానికి నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

## కార్యకర్తలను అభినందించిన ఎమ్మెల్సీ మేరీగ మురళిధర్



నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం):-నెల్లూరు జిల్లా రాపూరు మేజర్ పంచాయతీ హరిజనవాడలో ఇటీవల వైఎస్ఆర్సిపి పార్టీ క్యాడర్ విడుదల చేసిన మండల సోషల్ మీడియా ఎన్నికైనా కార్యకర్తలనుఎమ్మెల్సీ మేరీగ మురళిధర్ నేరుగా కలిసి వారిని అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా మేరీగ మురళిధర్ మాట్లాడుతూ పార్టీ మీపై పెట్టుకున్న నమ్మకాన్ని , వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆశయా సాధన ను మీరే ప్రజల్లోకి మరింత చెరువుగా తీసుకెళ్లాలని ఇకపై రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మండల సెక్రెటరీ "డి. వి రమణయ్య" , బీట్ 1 కన్వీనర్ "దమ్మాయి రమణయ్య" , యూత్ ప్రెసిడెంట్ "దాసరి మోషే" , యూత్ వైస్ ప్రెసిడెంట్ దాసరి "సైలెష్", సోషల్ మీడియా కార్యకర్త మనోజ్ కుమార్, అరుణ, వరలక్ష్మి, రేవురు ప్రశాంత్, దాసరి నరసింహులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## చింతల్‌మెట్‌లో భవన నిర్మాణ కార్మికుల అవగాహన సదస్సు



తెలుగు గళం, రాజేంద్రనగర్: భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చింతల్ మెట్ లేబర్ అడ్డాలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు యొక్క విలువను తెలియజేయడానికి లేబర్ కార్డు నుంచి ఎలా లబ్ధి పొందాలని కార్మికులకు అవగాహన కార్యక్రమం ఈరోజు ఉదయం చింతల్ మెట్ లేబర్ అడ్డాలో జరిగింది ఈ సమావేశం ఏఐటీయూసీ రాజేంద్రనగర్ మండల ఆధ్వర్యంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి సలీం సయ్యద్ కాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బి. వల్య అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మరియు శ్యాం కుమార్ జూనియర్ అసిస్టెంట్ శంషాబాద్ వారు హాజరై భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది వారు మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు 110 చెల్లించి భవన నిర్మాణ సంక్షేమ మండలిలో నమోదు చేసుకోవాలని చెప్పారు నమోదు చేసుకున్న కార్మికులకు ఐదు సంవత్సరాల వరకు ఈ కార్డు కాలపరిమితి ఉంటుందని ఈ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా కింద పది లక్షల అందించడం జరుగుతుందని అలాగే సహజ మరణం కింద రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని వసతి సహాయ మరియు వివాహ కానుక కింద 30000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు కార్డు ఉన్న ప్రతి కార్మికుడు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మీసేవ ద్వారా రెన్యువల్ చేసుకోవాలని చెప్పడం జరిగింది లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లోకి డబ్బులు రావడం జరుగుతుంది కాబట్టి మధ్యవర్తులు ఎవరిని ఆశ్రయించవద్దని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఎండి సలీం సయ్యద్ కాజా మరియు ఏఐటీయూసీ నాయకులు అలీ భాయ్ మరియు సిపిఐ చింతల్ మెట్ శాఖ కార్యదర్శి ఎండి సాబీర్ భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయండి

- యువమోర్చా అత్తాపూర్-హైదర్గూడ డివిజన్ అధ్యక్షుడు సుల్గే మణికంఠ పిలుపు

తెలుగు గళం,రాజేంద్రనగర్: ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యువమోర్చా అత్తాపూర్-హైదర్గూడ డివిజన్ అధ్యక్షుడు సుల్గే మణికంఠ పిలుపునిచ్చారు. ఈ సభకు డివిజన్ నుండి 100కు పైగా బైక్‌లతో భారీ ర్యాలీగా తరలివెళ్లాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన తెలిపారు . ఈ సందర్భంగా సుల్గే మణికంఠ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు యువతకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయని, మోదీకి స్వాగతం పలికేందుకు యువత ఉత్సాహంగా ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ విశ్వగురువుగా ఎదుగుతోందని, తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అత్తాపూర్-హైదర్గూడ డివిజన్ నుండి వందలాది మంది యువకులు బైక్ ర్యాలీగా పరేడ్ గ్రౌండ్‌కు తరలివెళ్లి, యువశక్తి సత్తా చాటాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



డివిజన్ పార్టీ అధ్యక్షులు సుల్గే వెంకటేష్, పస్పుల సందీప్ ముదిరాజ్, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, అమర్ రెడ్డి, భూపాల్, అఖిల్, లఖన్, శివరాజ్, వంశీ తదితరులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.

# ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్న లింఫాటిక్ మసాజ్ అసలేంటిది.. ఎలాంటి లాభాలను ఇస్తుంది..?



హెల్త్ న్యూస్, 07 మే (తెలుగు గళం): శరీరంలో బ్లోటింగ్, వాపు, అలసట వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయా? అయితే తాజాగా ప్రాచుర్యంలోకి వచ్చిన లింఫాటిక్ మసాజ్ అనే పద్ధతి ఈ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది పూర్తిగా నిరూపితమైన చికిత్స కాదని, ముఖ్యంగా డిటాక్స్ లేదా సాధారణ బ్లోటింగ్ విషయంలో ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. లింఫాటిక్ మసాజ్ కు మరో పేరు మాన్యువల్ లింఫాటిక్ డ్రైనేజ్. శరీరంలోని లింఫాటిక్ వ్యవస్థను ఉత్తేజపరచే సున్నితమైన మసాజ్ పద్ధతి. ఈ వ్యవస్థ శరీరంలో వ్యర్థాలు, టాక్సిన్లు, అదనపు ద్రవాన్ని తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణ డీప్ టిష్యూ మసాజ్‌లకు భిన్నంగా, ఇందులో తేలికైన, రిథమిక్ స్ట్రోక్స్‌తో లింఫ్ ద్రవ ప్రవాహాన్ని మెరుగుపరుస్తారు.

**ద్రవ ప్రవాహాన్ని మెరుగు పరిచే మసాజ్..**

బ్లోటింగ్ సమస్య కేవలం ఆహారం వల్ల మాత్రమే కాకుండా, నీటి నిల్వ (వాటర్ రిటెన్షన్), రక్తప్రసరణ లోపం, హార్మోన్ మార్పులు, జీర్ణక్రియ సమస్యలు, ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాల వల్ల కూడా వస్తుంది. లింఫాటిక్ వ్యవస్థ సరిగా పనిచేయకపోతే శరీరంలో ద్రవం నిల్వ అయి భారంగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మసాజ్ ద్వారా ద్రవ ప్రవాహం మెరుగుపడి వాపు, పఫినెస్ తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే శరీరంలోని వ్యర్థాలను తొలగించే ప్రక్రియకు మద్దతు లభిస్తుంది. రక్తప్రసరణ మెరుగుపడటంతో శరీరం తేలికగా, ఉత్సాహంగా అనిపిస్తుంది. కొందరు వ్యక్తులు దీన్ని తరచూ చేయడం వల్ల జీర్ణక్రియ కూడా కొంతవరకు మెరుగుపడిందని చెబుతున్నారు.

**తేలికగా, మృదువుగా..**

ఒక సాధారణ లింఫాటిక్ మసాజ్ సెషన్‌లో తేలికైన, స్లో స్ట్రోక్స్ ఉపయోగిస్తారు. ముఖ్యంగా మెడ, పొత్తికడుపు, చేతులు, కాళ్లపై దృష్టి పెడతారు. ఇది రిలాక్సింగ్‌గా ఉండే ప్రక్రియ, తీవ్రంగా ఒత్తిడి ఉండదు. చాలా మందికి వెంటనే తేలికగా అనిపించడం సాధారణం. ఇంట్లో కూడా కొంతవరకు ఈ మసాజ్ చేయవచ్చు. అయితే నిపుణుల మార్గదర్శకత్వంలో మాత్రమే చేయడం మంచిది. తేలికైన ఒత్తిడితో, మెడ దగ్గర నుంచి ప్రారంభించి, లింఫ్ నోడ్స్ దిశగా నెమ్మదిగా మసాజ్ చేయాలి. అక్కడ తీవ్రంగా ఒత్తిడి చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. క్రమం తప్పకుండా చేయడం ముఖ్యమే గానీ బలంగా చేయడం అవసరం లేదు.

**అందరికీ సెట్ కాదు..**

అయితే ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదు. ఇన్ఫెక్షన్లు, గుండె సమస్యలు, కిడ్నీ వ్యాధులు లేదా ద్రవ సమతౌల్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. సందేహం ఉంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. లింఫాటిక్ మసాజ్ ఒక సహాయక పద్ధతి మాత్రమే. ఇది మాయమంత్రంలా అన్ని సమస్యలను పరిష్కరించదు. తగినంత నీరు తాగడం, నిత్యం వ్యాయామం చేయడం, లోతైన శ్వాస సాధన, ఉప్పు వినియోగాన్ని నియంత్రించడం, సరైన నిద్ర వంటి మంచి అలవాట్లతో కలిపి చేస్తే దీని ప్రయోజనాలు మెరుగుపడతాయి. శరీరాన్ని చురుకుగా ఉంచడం ద్వారా లింఫాటిక్ వ్యవస్థను సహజంగా సక్రమంగా పనిచేయేలా చేయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## బెంగాల్ పాలిటిక్స్‌లోకి 'దాదా' ఎంట్రీ? బీజేపీ నేతతో సౌరవ్ గంగూలీ భేటీ



స్పోర్ట్స్ న్యూస్, 07 మే (తెలుగు గళం): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెలువడిన వేళ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, 'బెంగాల్ టైగర్' సౌరవ్ గంగూలీ తన నివాసంలో బీజేపీ నేత పీఎన్ పాఠక్ తో సుమారు 2 గంటలకు పైగా భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో గంగూలీ త్వరలోనే కాషాయ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం మళ్లీ ఊపందుకుంది.

అయితే, ఈ భేటీ కేవలం మర్యాదపూర్వకమేనా, లేక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, గతంలో కూడా గంగూలీ రాజకీయాల్లోకి వస్తారని వార్తలు వచ్చినప్పటికీ, ఆయన వాటిని సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చారు. కానీ, తాజా ఫలితాల తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో 'దాదా' ఏ నిర్ణయం తీసుకుంటారోనని బెంగాల్‌తో పాటు దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఐపీఎల్ ఫైనల్ వేదిక మార్పుపై డికె శివ కుమార్ క్లారిటీ!



స్పోర్ట్స్ న్యూస్, 07 మే (తెలుగు గళం): ఐపీఎల్ 2026 ఫైనల్ వేదికపై వివాదం రాజుకున్న సంగతి తెలిసిందే. బెంగళూరులో నిర్వహించాల్సిన ఈ ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ కు తరలి వెళ్ళింది. కర్ణాటక రాష్ట్రంలో ఎమ్మెల్యేలు ఐపీఎల్ టికెట్లు కావాలని గొడవ చేస్తున్న క్రమంలో.. బీసీసీఐ వేదికను తరలించినట్లు సోషల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో ఐపీఎల్ ఫైనల్ వేదిక మార్పుపై డీకే శివకుమార్ క్లారిటీ ఇచ్చారు.

తమపై వస్తున్న విమర్శలను కొట్టి పారేసిన శివకుమార్, అసలు వాస్తవాలను బయటపెట్టే ప్రయత్నం చేశారు. అహ్మదాబాద్ లో భారీ స్టేడియం ఉందన్నారు. ఈ తరుణంలో ఎక్కువ మంది ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉండటం కారణంగా బీసీసీఐ వేదికను తరలించినట్లు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఎమ్మెల్యేలకు టికెట్ల పంపిణీ గొడవలకు, వేదిక మార్పునకు ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. కాగా ఐపీఎల్ ఫైనల్ అహ్మదాబాద్ వేదికగా జరుగనుండగా, క్వాలిఫైయర్ 1 ధర్మశాలలో జరుగనుంది. మిగిలిన రెండు ప్లే ఆఫ్స్ మ్యాచ్ లు న్యూ చండీగఢ్ వేదికగా జరుగుతాయి.

## ప్యాట్ కమిన్స్‌కు రూ.113 కోట్ల బంపర్ ఆఫర్



స్పోర్ట్స్ న్యూస్, 07 మే (తెలుగు గళం): హైదరాబాద్ సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ను ఓ భారీ డీల్ వరించినట్లు సమాచారం. కమిన్స్ తమ దేశం తరఫునే పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా(సిఏ) భారీ ఆఫర్ ప్రతిపాదించింది. అంతర్జాతీయ టీ20 లీగ్‌ల నుండి వస్తున్న భారీ ఆఫర్ల నేపథ్యంలో.. కమిన్స్‌కు మూడేళ్ల కాలానికి సుమారు 12 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.113 కోట్ల మెగా డీల్‌ను ఆఫర్ చేసినట్లు సమాచారం. ఈ ఒప్పందం ప్రకారం కమిన్స్ రాబోయే మూడేళ్లపాటు ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలో ఆడేందుకు బాండ్ రాసివ్వాల్సి ఉంటుంది. ఈ పరిణామం వెనుక ఐపీఎల్ ఫ్రాంచైజీల నుండి వస్తున్న తీవ్రమైన పోటీ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇటీవల ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీ ప్రపంచవ్యాప్తంగా తాము నిర్వహించే వివిధ లీగ్‌లలో ఆడేందుకు కమిన్స్‌కు సుమారు 6.6 మిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.62 కోట్ల మెగా ఆఫర్ ఇచ్చిందని వార్తలు వచ్చాయి.

ఒకవేళ కమిన్స్ ఈ ప్రైవేట్ డీల్‌కు మొగ్గు చూపితే, అతను ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు అందుబాటులో ఉండటం కష్టమవుతుందనే ఆందోళనతో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ స్థాయిలో స్పందించింది. లీగ్ క్రికెట్ కంటే జాతీయ జట్టుకే ప్రాధాన్యత ఇచ్చేలా ఆటగాళ్లకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు వ్యూహం అని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే ప్యాట్ కమిన్స్ అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే ఆటగాడిగా రికార్డు సృష్టించనున్నాడు.

## రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై లక్నో విజయం



స్పోర్ట్స్ న్యూస్, 07 మే (తెలుగు గళం): ఐపీఎల్ 2026లో భాగంగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం పలుమార్లు అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం లక్ష్యాన్ని 213గా నిర్దేశించారు. ఛేదనలో ఆర్సీబీ నిర్ణీత 19 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్సీబీ బ్యాటర్లలో రజత్‌పాటిదార్ (61, 31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేశాడు. టిమ్ డేవిడ్ (40), దేవ్‌దత్ పడిక్కల్ (34) రాణించారు. కృనాల్ పాండ్య 28*, రొమారియో షెఫర్డ్ 23* నాటౌట్‌గా నిలిచారు. జాకబ్ బెతెల్ (4), విరాట్ కోహ్లీ (0), జితేశ్ శర్మ (1) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3, షహబాజ్ అహ్మద్ 2, మహ్మద్ షమీ 1 వికెట్ తీసుకున్నారు.అంతకు ముందు లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లలో ఓపెనర్ మిచెల్ మార్ష్ (111; 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. పూరన్ (38), రిషభ్ పంత్ (32*) రాణించారు, అర్షిన్ కులకర్ణి (17) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# శంబాల మేకర్స్‌తో సందీప్ కిషన్

## పోస్టర్‌తోనే హైప్ పెంచారు!

టాలీవుడ్ యువ నటుడు సందీప్ కిషన్, 'శంబాల' మేకర్స్‌తో చేతులు కలిపారు. 'శంబాల' చిత్ర దర్శకుడు యుగంధర్ మునితో ఆయన తన 33వ సినిమాను చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ మూవీ బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేస్తూ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ప్రస్తుతం ఈ సినిమాను ఎస్కే 33 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. విడుదలైన పోస్టర్‌లో టైటిల్‌తో పాటు ఒక కత్తి కనిపించగా, చిన్న ఒడ్డుపై బుట్టలో పడుకున్న పాపను ఒక సింహం చూస్తున్న దృశ్యం ఆకట్టుకుంటోంది. ఈ విజువల్స్‌ను బట్టి చూస్తే ఇది పూర్తి స్థాయి అడ్వెంచర్ నేపథ్యంలో సాగే సినిమా అని స్పష్టమవుతోంది. 'శంబాల' తర్వాత కూడా యుగంధర్ ముని మరో విభిన్న కథతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రాన్ని 'శంబాల'ను నిర్మించిన శైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వరుస పరాజయాలతో ఇబ్బందుల్లో ఉన్న సందీప్ కిషన్‌కు ఈ సినిమా మంచి విజయాన్ని అందిస్తుందేమో చూడాలి.







# 'బ్లడీ రోమియో' వాయిదా

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. శ్రీకాంత్ ఓదెల, సుజీత్, సీబీ చక్రవర్తి ఇలా సాలిడ్ లైనప్ సెట్ చేసుకున్నాడు. ఈ లైనప్‌లో ఉన్న మోస్ట్ అవేటెడ్ క్రేజీ యాక్షన్ ఫిలిం 'బ్లడీ రోమియో' ఇప్పుడు వాయిదా పడేలా కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం నాని నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'ది పారడైజ్' షూటింగ్‌లో జరుగుతున్న డిలే అని తెలుస్తోంది.

శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో నాని నటిస్తున్న 'ది పారడైజ్' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ముందుగా ఈ సినిమాను 2026 సమ్మర్‌లోనే విడుదల చేయాలనుకున్నప్పటికీ క్వాలిటీ విషయంలో రాజీ పడకూడదని మేకర్స్ దీనిని 2026 ఆగస్టు 21కి వాయిదా వేశారు. ప్రస్తుతం నాని తన పూర్తి కాల్ షీట్స్ ఈ సినిమాకే కేటాయించాల్సి రావడంతో సుజీత్ దర్శకత్వంలో రావాల్సిన 'బ్లడీ రోమియో' షూటింగ్ స్టార్ట్ అవడానికి మరింత ఆలస్యమైంది. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఏడాది ఆఖరిలో లేదా 2027లోనే 'బ్లడీ రోమియో' పట్టాలెక్కే అవకాశం ఉంది. మరోవైపు 'బ్లడీ రోమియో' ఆలస్యం కావడంతో దర్శకుడు సుజీత్ ఈ సినిమాను పక్కన పెట్టేసి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఓజి 2' స్క్రిప్ట్ పనులపై దృష్టి సారించారు. 'ఓజి' హిట్ కావడంతో సీక్వెల్ కథను మరింత పకడ్బందీగా పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం సుజీత్ ఈ స్క్రిప్ట్‌ను ఫైనలైజ్ చేసే పనిలో నిమగ్నమై ఉన్నాడని నాని డేట్స్ దొరికినపుడు బ్లడీ రోమియో చేసేలా ప్లాన్ చేసుకుంటున్నట్టు ఫిలిం నగర్ లో వినిపిస్తున్న టాక్.

# పెద్ది ఫైనల్ ఎడిట్ లాక్‌డ్

## గుడ్ న్యూస్ చెప్పిన మూవీ యూనిట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రానికి సంబంధించిన పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఈ సినిమాను జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. విడుదలకు సమయం దగ్గర పడుతుండడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా ముగిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫైనల్ ఎడిట్ లాక్ అయినట్లు మూవీ యూనిట్ అధికారికంగా వెల్లడించింది. అలాగే జూన్ 4న గ్రాండ్‌గా విడుదల చేయనున్న ఈ సినిమాకు ముందు రోజు అంటే జూన్ 3న పెద్ద ఎత్తున ప్రీమియర్స్ నిర్వహించనున్నట్లు కూడా ప్రకటించారు. ఈ అప్డేట్స్‌తో మూవీ యూనిట్ ఫుల్ జోష్‌లో ఉండగా, మెగా అభిమానులు కూడా భారీ స్థాయిలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, దివ్యాంధు, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.



# ఇట్స్ అఫీషియల్

## సమంత సినిమా వాయిదా

సమంత హీరోయిన్‌గా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'. నందిని రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాని, సమంత స్వయంగా తన 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్ మీద నిర్మిస్తోంది. అయితే, ఈ సినిమా ముందుగా ప్రకటించిన ప్రకారంగా మే 15వ తేదీన రావాల్సి ఉంది. కానీ మే 6వ తేదీ వచ్చినా ఇంకా ప్రమోషన్స్ మొదలుకాలేదు. అయితే, ఈ సినిమా రిలీజ్ కాకపోవచ్చు అని అంచనాలు ముందు నుంచి ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్లు జూన్ 4వ తేదీన రిలీజ్ చేయమని కోరినట్లు ఆమధ్య వార్తలు రాగా, ఆ వార్తలు వచ్చిన రెండు మూడు రోజుల్లోనే.. అదే జూన్ 4వ తేదీన 'పెద్ది' రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఈ సినిమా ఎప్పుడు వస్తుందో అనే అనుమానాలను నివృత్తి చేస్తూ, సినిమాని జూన్ 19వ తేదీ రిలీజ్ చేస్తున్నట్లు టీం ప్రకటించింది. ఐపీఎల్ సీజన్లో క్లాష్ ఉండకూడదు అనే ఉద్దేశంతోనే వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ తెరవెనుక ఈ సినిమాకి సెన్సార్ అడ్డంకులు కూడా ఏర్పడినట్లుగా తెలుస్తోంది. సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే టైటిల్ మార్చమని కూడా కోరినట్లుగా వార్తలు వస్తున్నాయి. దానికి తోడు మే 15 నుంచి 30 వరకు ఐపీఎల్ క్లైమాక్స్ మ్యాచులు జరుగుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే యువత అంతా మ్యాచుల వైపు ఆకర్షితులవుతారు. ఈ క్రమంలోనే ఐపీఎల్ వల్ల ఎలాంటి ఇబ్బంది కలగకూడదని టీం ఈ నిర్ణయం తీసుకుని ఉండి ఉండవచ్చు.






# విజయ్ సరసన కృతిసనన్

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అయితే 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్ దర్శకత్వంలో విజయ్ ఒక మైథలాజికల్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. వైరా ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ హీరోయిన్..కృతీసనన్‌ను చిత్ర బృందం సంప్రదిస్తున్నట్లు ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ కాంబినేషన్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కృతీసనన్ గతంలో మహేశ్‌బాబు 'వన్ : నేనొక్కడినే', ప్రభాస్ 'ఆది పురుష్', నాగచైతన్య 'దోచెయ్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. కానీ ఒక్క మూవీ కూడా హిట్ అవ్వలేదు. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఓకే అయితే, విజయ్ దేవరకొండ - కృతీసనన్ జోడీ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీల్‌ను తీసుకురావడం ఖాయం. కాగా ప్రస్తుతం విజయ్ 'రణబాలి', 'రౌడీ జనార్ధన' సినిమాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల షూటింగ్ ముగింపు దశకు చేరుకున్న తర్వాత శౌర్యువ్ దర్శకత్వంలో రాబోయే మైథలాజికల్ సినిమాను విజయ్ ఆరంభించే అవకాశం ఉంది

# జాన్వీ పెళ్లి వార్తలపై

## బోనీ కపూర్ సీరియస్

బాలీవుడ్ స్టార్ కిడ్ జాన్వీ కపూర్, ఆమె ప్రియుడు శిఖర్ పహారియాల పెళ్లి గురించి గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. వీరు తిరుపతిలోనో లేదా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోనో రహస్యంగా పెళ్లి చేసుకోబోతున్నారంటూ ప్రచారం జరిగింది. అయితే, ఈ పుకార్లన్నింటికీ తాజాగా ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ ఫుల్ స్టాప్ పెట్టారు. 'అందులో అస్సలు నిజం లేదు' అని ఆయన కుండబద్దలు కొట్టారు.. 'ప్రస్తుతం జాన్వీ తన కెరీర్ మీద చాలా సీరియస్‌గా ఉంది, ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచన ఆమెకు లేదు' అని బోనీ కపూర్ స్పష్టం చేశారు. నిజానికి జాన్వీ-శిఖర్ మధ్య ప్రేమ వ్యవహారం ఎప్పటి నుంచో నడుస్తోంది. ఒక ఇంటర్వ్యూలో జాన్వీ మాట్లాడుతూ, శిఖర్ తన పక్కన ఉంటే ఎంతో ధైర్యంగా ఉంటుందని, కష్టాల్లో అతను తనకు అండగా నిలుస్తున్నాడని ఎమోషనల్ కూడా అయ్యింది. కపూర్ ఫ్యామిలీలో ఏ చిన్న పండగ జరిగినా శిఖర్ అక్కడ వాలిపోతుంటారు. కానీ బోనీ కపూర్ చెప్పనట్లుగానే.. ప్రస్తుతానికి జాన్వీ దృష్టి అంతా తన సినిమాలపైనే ఉంది. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఆమెకు భారీ ఆఫర్లు వస్తున్నాయి. అందుకే వ్యక్తిగత జీవితం కంటే వృత్తిపరమైన విజయాలకే ఆమె ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తోంది.



Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.